ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా రామాంజనేయులు బాధ్యతల స్వీకరణ



నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్. రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. 2004వ బ్యాచ్‌కు చెందిన రామాంజనేయులు మహబూబ్‌నగర్ తో పాటు నగరంలో వివిధ పోలీస్ స్టేషన్‌లో, టాస్క్‌ఫోర్స్‌లో ఎస్ఐగా పని చేశారు. 2013 లో పదోన్నతి పొందిన ఆయన ఇంటెలిజెన్స్, గ్రీన్ ఫార్మసిటీ సీఐగా, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహించారు. కొంత కాలంగా స్పెషల్ బ్రాంచ్ కొనసాగుతున్న రామాంజనేయులు ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం ఆయన ఎల్‌బీనగర్ ఠాణాలో మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యమిస్తానని, ఈవ్‌టీజింగ్ పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



అంజిరెడ్డి కాలనీవాసులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యనిపుణులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని అంజిరెడ్డి కాలనీ గణేష్ పార్కులో శనివారం రెడీ టు సర్వ్ ఫౌండేషన్, ముత్తూట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మూడు వందల మంది కాలనీవాసులకు వైద్యనిపుణులు బీపీ, షుగర్, కిడ్నీ, గుండె, లివర్ వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, సాయిరాంనగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు వెంకటరెడ్డి, దుర్గారెడ్డి, మోహన్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు శివనేత పాల్గొన్నారు.

భీమానగర్‌లో మౌలిక వసతులు కల్పిస్తా



కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డిని శాలువాతో సత్కరించిన కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: భీమానగర్‌కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం భీమానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను మర్యాదపురంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు. వీధి దీపాలు వంటి వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకనిధులు తీసుకువస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , భీమానగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు జి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎ.నరేశ్, కోశాధికారి ఎం,కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణ చారి, భగవాన్‌రెడ్డి, కొండానాయక్, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రత్యంగిరా దేవి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ప్రత్యంగిరాదేవికి అన్నాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో కొలువైన ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ, మహా నక్షత్ర హారతి నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. యాగ మండపంలో దేవతా హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు, చాణిక్య శర్మ, విట్టల్ శర్మ, సాయికుమార్ శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సరూర్‌నగర్ కొత్త ఇన్‌స్పెక్టర్



ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా వి.సైదిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన శ్రీనివాస్ పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా బదిలీ అయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన సైదిరెడ్డి గతంలో మల్కాజిగిరి సీసీఎస్, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలు కాపాడతామని, మత్తు పదార్థాల రవాణాపై కఠినంగా వ్యవహరిస్తామని సైదిరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రైవేట్ హాస్టళ్లపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోండి

లింగోజిగూడ: సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సైదిరెడ్డిని శనివారం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. లింగోజిగూడ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్, రోహిత్, దేవేందర్, నరేందర్, సయ్యద్ అమీర్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



సీఐకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సైదిరెడ్డిని శనివారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు రేపల వినయ్, రాఘవేంద్ర, పురుషోత్తం, శశి యాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పనులు కాలనీవాసుల అవస్థలు!

- డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్
- ఇళ్లలో నిలిచిపోతున్న మురుగు
- ఎగసి వస్తున్న దుర్వాసన
- మట్టి దిబ్బలతో రాకపోకలకు ఇక్కట్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జలమండలి అధికారులు
- నాగోలు అనంతుల కాలనీలో పరిస్థితి ఇదీ





అనంతుల కాలనీలో మధ్యలోనే నిలిచిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు



కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ

నాగోలు: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... అధికారుల ఉదాసీనత కాలనీవాసులను తీవ్ర అవస్థలు పాల్జేస్తోంది. ఒకపక్క మురుగు నీటి దుర్వాసన.. మరోపక్క రోడ్లపై మట్టిదిబ్బల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి. హయత్‌నగర్ సర్కిల్ నాగోలు డివిజన్ అనంతుల కాలనీలోని పరిస్థితి ఇదీ. జలమండలి ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- అనంతుల కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం జలమండలి అధికారులు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ప్రధాన రోడ్లపై తవ్వకాలు జరిపిన కాంట్రాక్టర్ మట్టిని రోడ్డుపైనే దిబ్బలుగా పోశాడు.
- అయితే, కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండానే మధ్యలోనే నిలిపేశాడు. ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇంటి పరిసరాల్లో మురుగునీరు పారుతూ తీవ్రమైన దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కాలనీ రోడ్లన్నీ మట్టిదిబ్బలతో నిండిపోవడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలుపడటం లేదని కానీవాసులు వాపోతున్నారు.
- అధికారుల ఉదాసీన వైఖరి వల్లే కాంట్రాక్టర్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయడంపై నిర్లక్ష్యం చేస్తున్నాడని, ఫలితంగా తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు.
- ఈ విషయంపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు దేప మధుసూదన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి అనంతుల కాలనీలో డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు సాయి సంస్థాన్‌లో ఉచిత వైద్య శిబిరం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌లో అలేఖ్యాస్ న్యాచురల్ హెల్త్‌కేర్ సెంటర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వైద్యశిబిరంలో నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులు, ఎల్4, ఎల్ 5 డిస్క్ సమస్యలు, సయాటిక, భుజం, మెడ నొప్పులు వంటి సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు చోరీ



బీరువాలోని వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

నాగోలు: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, నగదు అపహరించుకెళ్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఎల్‌బీనగర్ మైత్రీనగర్ కాలనీ నివాసం ఉండే చిన్నగోని కిషోర్ శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి నల్గొండ జిల్లా, చండూరుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువాలో భద్రపర్చిన 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, ఇతర వస్తువులు కనిపించలేదు. దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎల్‌బీనగర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 09, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 21. దొండ 31, ఆలు 23, ఉల్లి 24, గోకర 45, దోస 21, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 50, మునగ 50, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 55.

మహమూద్ అలీకి నేతల శుభాకాంక్షలు



మహమూద్ అలీని సన్మానిస్తున్న సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: మాజీ హోంమంత్రి మహమూద్ అలీ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు అజంపురాలోని ఆయన నివాసానికి వెళ్లి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి ఐఎస్‌సదన్ డివిజన్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి మహమూద్ అలీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి డివిజన్ పార్టీ నాయకులతో కలిసి మహమూద్ అలీని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌సింగ్ ఠాకూర్, రమేష్, పరమేష్, సుభాష్, జ్యోతి, రాధ, ప్రమీల పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయ పనులను పరిశీలించారు. దాతలు విరాళాలు ఇచ్చి నిర్మాణ పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆలయ కమిటీ సభ్యులను ఆయన కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, నరేందర్, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు రిపోర్టు అందజేసిన డాక్టర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: సాహేబ్‌గూడలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు శనివారం నిర్వహించారు. 150 మందికి పైగా పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జహంఘీర్‌ఖాన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్రం రంగారెడ్డి జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ నిహా అహ్మద్, సీఎస్‌సీ హెల్త్‌కేర్ సాయితేజ, శివ, రాజశ్రీలతో పాటు తదితరులు పాల్గొన్నారు. మహిళా అధ్యక్షురాలు రమేశ్వరి, ముస్లిం మహిళా అధ్యక్షురాలు షైమీద, ఎస్సీసెల్ అధ్యక్షురాలు లక్ష్మమ్మ, మహిళా గ్రూపు సంఘం అధ్యక్షురాలు కవితలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో రద్దీగా కనిపించాయి. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరువ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.

బీజేపీ బలోపేతానికి కృషి

ఎంపీపీ కుండె వెంకటేశ్

మహేశ్వరం: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని మహేశ్వరం ఎంపీపీ కుండె వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని నియోజకవర్గ బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధిలు కలిశారు. ఇటీవల జరిగిన మహేశ్వరం ఎంపీపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో లక్కీ డ్రాలో బీజేపీ అభ్యర్థి కుండె వెంకటేష్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ నాయకత్వంలో కిషన్‌రెడ్డిని కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రతి నాయకుడు కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య, ఎంపీటీసీ అభ్యర్థులు మద్ది రామిరెడ్డి, పోతర్ల సుదర్శన్ యాదవ్, అనితాకృష్ణ నాయక్, మండల అధ్యక్షుడు మాధవచారి, దళితమోర్చా మండల అధ్యక్షుడు గొల్లూరు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ కుండె వెంకటేశ్

అసంపూర్తి పనులను పూర్తి చేయండి: ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి, డీసీలతో అభివృద్ధి పనులపై శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే వర్షా కాలాన్ని దృష్టి ఉంచుకొని నాలాల్లో, డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టాలని సూచించారు. డీసీలు ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీసీలు తిప్పర్తి యాదయ్య, జాకియా సుల్తానా సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సంక్షేమ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవన నిర్మాణ పనులను శనివారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరిన్ని సౌకర్యాలు



ఆలయ ప్రాంగణంలో షెడ్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: దాతల సహాయ, సహకారంతో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. స్వామివారి గర్భాలయ ప్రాంగణం ముందు ఓ దాత ఏర్పాటు చేయిస్తున్న రేకుల షెడ్ పనులను ఆయన శనివారం ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, పాలక మండలి సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు మేక సురేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, మధుసాగర్, సతీష్‌గౌడ్, తిరుమలేష్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా ఫక్రుద్దీన్ దర్గా ఉత్సవాలు



పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని బాబా ఫక్రుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 3, 4 తేదీలలో నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లీ షా మహ్మద్ రహీముద్దీన్ షకీల్ షహర్వరీ తెలిపారు. ఆదివారం సాయంత్రం జల్‌పల్లి మజీద్ నుంచి సందల్ ఊరేగింపుగా బయల్దేరి మామిడిపల్లి మార్గంలోని సయ్యద్ ఫక్రుద్దీన్ బాబా దర్గాకు చేరుకుంటుంది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదానం, 4వ తేదీనా ముషాయిరా ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలకు నగరం నలుమూలల నుంచి భక్తులు హాజరుకానున్నారని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ నేత శివచరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్సూరాబాద్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం మన్సూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆలూరి పుల్లయ్య, గంట శ్రవణ్, పృథ్వీరాజ్, రఘుపతి, స్వామిగౌడ్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, శివచరణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వివేకానందనగర్‌కాలనీలోని పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్, పండ్లు, మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీత



చైతన్యపురి రవీంద్రభారతి పాఠశాలలో...



హయత్‌నగర్ రవీంద్రభారతిలో...



వనస్థలిపురం మిలీనియం పాఠశాలలో...

చైతన్యపురి: జాతీయ సైన్స్ డే సందర్భంగా చైతన్యపురిలోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు ఎ. శ్రీకర్, ఎస్‌వీ రాజేష్ హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు రూపొందించిన 100కు పైగా ఎగ్జిబిట్స్ ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ బేబి బ్యూలా, డీన్ ప్రమీల, డీఐ క్రాంతి కుమార్, ఏడీఐ హరిప్రకాష్, అధ్యాపక బృందం పాల్గొంది.

హయత్‌నగర్ 'రవీంద్రభారతి'లో...

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సామాజిక, గణిత, రసాయన, భౌతిక, జంతు శాస్త్రాలకు సంబంధించిన పలు ప్రయోగాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. క్రిడా శాస్త్రవేత్త ఐ.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ఫిజికల్ ప్రొఫెసర్ సాధన, ఫిజిక్స్ ప్రొఫెసర్ బి.రవీందర్‌రెడ్డి ప్రత్యేక అతిథులుగా హాజరై ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల డీన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ స్రవంతి, డీఐ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిలీనియం హైస్కూల్‌లో...

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని రాజప్పనగర్‌లోని మిలీనియం హైస్కూల్‌లో క్రియేషన్ ఆఫ్ సైన్స్ పేరుతో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3, మ్యాథ్స్ పార్క్, సోలార్ ప్లానెట్, బాల రామమందిరం, సినిమా థియేటర్, తోలుబొమ్మలాట వరి పండించే విధానం తదితర ప్రయోగాల నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ ఎంవీవీ రఘుబాబు, పాఠశాల డైరెక్టర్ సూర్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.